

# తోడికోడలు

## చంద్రలత

తోచీ తోచనమ్మ తోడికోడలు పుట్టింటికి వెళ్లిందంటారు. అదేమో కానీ, మా తోడికోడలు మా పుట్టింటిలోనే మొదటిసారిగా నన్ను కలిసింది. అది కూడా సంపత్‌తో నా పెళ్లి విషయాలు మాట్లాడటానికి.

నేను అప్పటికే అమెరికాలో కంప్యూటర్స్‌లో ఎం.ఎస్. పూర్తిచేశాను. ఉద్యోగంలో చేరడానికి ముందుగా నా చిరకాల సైబర్ స్నేహితుడు సంపత్‌తో వివాహం జరగడమే సబబని అందరితోపాటు మేమూ భావించడంతో, ఆ వేసవిలో హైదరాబాదుకు వచ్చాను.

సంపత్ డెట్రాయిట్‌లో జి.ఎం. మోటార్స్‌లో పని చేస్తున్నాడు. నేను వచ్చిన వారంలోనే అతనూ హైదరాబాదు వచ్చాడు. ఇద్దరమూ ఒకరినొకరిని కలవడం అదే మొదటిసారి. మా కలయికతో మా రెండు కుటుంబాలు కలిసిపోయాయి. కొత్త చుట్టరికాలు. కొత్త బంధువులు.

ఎందుకోగానీ అందరిలోనూ సంపత్ వదిన శారద నన్ను ఎంతో ఆకట్టుకుంటుంది.

శారద ఓ చిన్న పల్లెటూరు నుంచి హైదరాబాదుకు వచ్చింది. అదీ సంపత్ వాళ్లన్న అనంత్‌ను పెళ్లాడాకే. వాళ్లది రైతు కుటుంబం. పెద్దగా చదువుల్లేవు. శారద డి.ఫార్మసీ చేసింది. పెళ్లయి నగరానికి రాగానే ఓ పెద్ద ఫార్మస్యూటికల్ కంపెనీలో చిన్న ఉద్యోగానికి చేరింది.

నిజానికి ఇవేవీ నన్ను ఆకర్షించలేదు.

శారద నాకన్నా వయసులో అయిదారేళ్లు పెద్దది. ఎత్తులో నాకన్నా అయిదారు అంగుళాలు చిన్నది.

ఈ విషయమూ నన్ను ఆకర్షించేది కానేకాదు.

ఆమె కట్టుబొట్టు, మాట మన్నన అన్నీ మామూలుగానే ఉన్నాయి.

అయితే, నన్ను ఆకర్షించింది ఆమె కళ్లలో కొట్టొచ్చినట్టు కనబడుతున్న ధీమా. ప్రపంచంలో నన్నెవరూ ఎదిరించలేరన్నంత ధీమా. ఆ ధీమాను ఒత్తి చూపుతో కొద్దిగా ఎత్తినట్లున్న కనుబొమలు.

నాకు తెలియని విషయం ఏదైనా ఉందా అన్నట్లు నిటారుగా పైకెత్తిన తల. ఆమె ధీమాకు పక్క తాళం వేస్తున్న చురుకైన చూపులు. ఆ చూపుల్లో నాకు అహంకారం కనిపించలేదు. అభిజాత్యమూ కనిపించలేదు.

కానీ, ఎందుకో ఆ చూపులు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ఎటు వెళ్లినా, ఏం చేసినా...

శారద నుంచి నేను ఆశించిన ప్రశంసను పొందలేకపోవడం వలన కలిగిన భావనే బహుశా నన్నిలా వెన్నాడుతోందేమో తెలీదు. ఏది ఏమైనా, నాకు తెలియకుండానే ఆమెపై ఒక ప్రత్యేక ఆసక్తి ఏర్పడిపోయింది.

సంపత్ అన్నయ్య అనంత్ ఫైనాన్స్ కంపెనీ పెట్టుకున్నాడు. శారద ఉద్యోగం. వాళ్లకు ఉన్న ఒక్క పిల్లవాడిని శారద పుట్టింటిలో వదిలివచ్చింది. మామయ్య పోవడంతో అత్తయ్య కూడా శారద వాళ్లదగ్గరే ఉంటోంది. పెళ్లి పనులన్నిటిలోనూ పెళ్లికొడుకు తరపు పెద్ద ముత్తయిదువ శారదే. అందువల్ల పెళ్లి పనులు అయ్యేలోగా అమ్మానాన్నలకు బాగా దగ్గరయింది.

సంపత్, నేనూ అమెరికా బయలుదేరబోతుండగా శారద వీడ్కోలు చెప్పడానికి వచ్చింది.

శారద వచ్చిన సమయంలో నేనూ, సంపత్ షాపింగ్‌కు వెళ్లాము. అమ్మానాన్నలతో శారద మాట్లాడుతుండగా నేను వచ్చాను. సంపత్ మరేదో పని ఉండటంతో ఇంటికి రాలేదు.

వచ్చీ రాగానే అప్పటికే కొనసాగుతున్న వాళ్ల సంభాషణలోకి నేనూ తలదూర్చాను.

''ఏంటి నాన్నా శారదను ఇబ్బంది పెట్టేస్తున్నారు?''

చెప్పాను కదా, నాకన్నా అయిదారు అంగుళాలు చిన్నదైన శారదను అక్క అని పిలవాలనిపించలేదు. వావివరుసలకేమిగానీ, శారదకూ ఏమీ చిన్నతనంగా లేదు. అదే ధీమా, అదే చూపు.

''ఏమీలేదు చిత్రా, మీ బావగారు అనంత్ వ్యాపారం గురించి.''

''దానికింత చర్చ దేనికి నాన్నా?''

''చర్చించాల్సిందే. ఈ మధ్యన ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయ్ చిట్‌ఫండ్ కంపెనీలు. చాలామంది ఇబ్బందుల్లో పడుతున్నారు. అదే చెపుతున్నా.''

''ఊరుకో నాన్నా. ఏదైనా శుభం కోరుకోవాలి గానీ...''

''నేనూ అదే అంటున్నా,'' అమ్మ నాకు వత్తాసు పలికింది.

శారద చిరునవ్వుతో మమ్మల్నే చూస్తోంది.

''చిత్ర మాటలకేమిగానీ శారదా, ఓ మాట అడుగుతా చెప్పు.''

''అడగండంకుల్,'' శారద నవ్వుతూనే అంది.

''నాకు తెలిసి మీకు ఈ హైదరాబాదులో పరిచయాలు గానీ, పలుకుబడిగానీ, వెన్నుదన్నుగానీ పెద్దగా లేవు. మరి డబ్బులు ఎలా రికవర్ చేస్తున్నారు? అది మీవల్ల అయ్యే విషయం కాదే.''

శారద చివ్వున తలెత్తింది. బుస్సుమంటోన్న నాగిని గుర్తొచ్చింది నాకు. అమ్మో, ఎంత కోపం. అయినా అదంతా ముఖంలోనే. మాటలు మామూలుగానే వున్నాయి.

''పలుకుబడి ఉంటేనే అన్నీ సాధ్యమవుతాయా అంకుల్? మేం రెండేళ్ల నుంచీ చిట్టీలు వేస్తున్నాం. ఎవరితో ఇబ్బంది రాలేదు. అందరూ కడతారు. ఇక ముందూ కట్టాల్సిందే''.

శారద గొంతులో గర్వం తొణికిసలాడింది.

''వెరీగుడ్. అంత విశ్వాసమూ, దానికి తగ్గ సామర్థ్యమూ మీకుంటే మంచిదే. కాకపోతే అనంత్ అంత మంచి ఉద్యోగం మానుకొని ఇలా చేయడం మంచిది కాదేమో. ఈపాటికి ఆడిటర్‌గా తానే సొంతంగా ప్రాక్టీసు పెట్టేవాడు కాదూ. పక్కదారి పట్టలేదూ.''

''ఆడిటర్‌గా ఎప్పటికంకుల్ సెటిల్ అయ్యేది? ఇప్పుడు చిట్టీ వేసిన ప్రతిసారీ ఒక చిట్టీ మాకు మిగిలి పోతుంది. కొత్తగా పదిలక్షల చిట్ వేశాం. వచ్చేనెల్లో ఇరవై లక్షలది వెయ్యబోతున్నాం. రెండూ అయ్యేలోగా ముప్ఫై లక్షలు మిగులుతాయి కదంకుల్,'' శారద కళ్లు మిల మిల మెరిశాయి.

అమ్మో, కొంపదీసి నాన్నని ఓ చిట్టీ కట్టమనదు కదా. నేను అనుమానంతో కళ్లను చిట్లించాను. బతికించింది నాన్ననేమీ అడగలేదు.

అయితే, నాన్న ఎందుకంతగా శారదను నిరుత్సాహపరచాలని ప్రయత్నిస్తున్నాడో నాకు అర్థం కాలేదు. అయినా, ఎవరి పని వారిది. నాన్న ఎందుకు వాళ్ల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం? ఉచిత సలహాలు గుప్పించడం? నాన్న ఎప్పటికి మారతాడో.

''మీరు అన్నది నిజమే అంకుల్. ఒక్కోసారి చిట్టీ పాడుకున్న వారి దగ్గర్నుంచి డబ్బు కట్టించడం గగనమై పోతుంది. కానీ చాలా చిట్టీలు మా ఆఫీసువాళ్లే వేస్తున్నారు. మా మేనేజరు కూడా వేస్తారు. అందుకే డబ్బు సులభంగానే రికవర్ అవుతుంది. మా ఆఫీస్‌లో చాలా మంది మా ఫైనాన్స్ ద్వారానే బాగుపడ్డారు,'' శారద ఎంతో సంతోషంగా చెప్పింది.

'శారదా కీపిటప్,' నేను అభినందించాను మనసులోనే. పైకి చెప్పడానికి ధైర్యం చాలలేదు. శారద ముఖంలో విశ్వాసం మరొకరి నుంచి ప్రోత్సాహాన్ని ఆహ్వానించేలా లేదు. ఆరోజే శారదను చివరిసారిగా కలిసింది.

మేము అమెరికా వెళ్లి ఎవరి ఉద్యోగాల్లో వాళ్లం చేరిపోయాం. సంపత్, నేను క్షణాల్ని కొలుచుకుంటూ, నిమిషాల్ని తూకమేస్తూ మా రొటీన్‌లో పడిపోయాం. ఆరేడు నెలలు గడిచిపోయాయి.

ఓరోజు సమయం కాని సమయంలో నాన్న దగ్గర నుంచి ఫోన్.

నేనెంతో ఆశ్చర్యపోయాను. భయపడ్డాను కూడా- ఏం ఉపద్రవం ముంచుకొచ్చిందోనని.

ఎందుకంటే, నాన్న ఒక వాచీకి అమెరికా టైం సెట్ చేసి ఉంటారు. వేళ కాని వేళ మమ్మల్ని నిద్ర లేపి ఇబ్బంది పెట్టకూడదని. మేమేమీ భారతీయ సమయాన్ని పాటించం. తరచూ వాళ్లని అర్ధరాత్రి అపరాత్రి నిద్రలేపి పలకరిస్తూనే ఉంటాం. అది వేరే విషయం.

ఎటూకాని సమయంలో అర్ధరాత్రి రెండున్నర గంటలకు నాన్న ఫోన్ చేయడంతో చాలా భయపడి పోయాను. ఆ భయంతోనే ఓ చేత్తో ఫోన్ పట్టుకొని, మరో చేత్తో గాఢనిద్రలో ఉన్న సంపత్‌ను గబగబ తట్టి లేపే

శాను. సంపత్ ఓ మూలుగు మూలిగి మళ్లీ ముసుగేశాడు.

''ఏంటి నాన్నా విషయం?'' నేను భయం భయంగా అడిగాను.

"ఖంగారు పడకు." నాన్న నెమ్మదిగా అన్నా ఆ గొంతు మామూలుగా లేదు. ఆందోళనను గంభీరం కింద అణిచిపెట్టినట్లుంది.

"శారద ఇక్కడే ఉంది."

"ఓహ్." నేను తేలిగ్గా గాలి వదిలాను.

"కంగారు పెట్టేశావుగా నాన్నా. శారదేగా వచ్చింది. మేం తరచూ మాట్లాడుతూనే ఉంటాంగా. ఏమైనా విశేషాలున్నాయా ఏంటి? అత్తయ్య ఆరోగ్యం అదీ..."

"అనంత్ కనిపించడం లేదు."

"వ్హాట్?" నాకు తెలియకుండానే నేను హైదరాబాద్‌కు వినిపించేంత గట్టిగా అరిచాను.

సంపత్‌కు నిద్రమత్తు వదలడమే కాదు. మంచం మీద నుంచి ఎగిరి నా పక్కన వచ్చిపడ్డాడు.

"హాయ్, చిత్రా ఏమిటి విషయం?"

నేను మౌనంగా ఫోన్ సంపత్ చేతిలో పెట్టబోయాను.

"చిత్రా," ఫోన్‌లో నాన్న గొంతు పక్కనున్న సంపత్ గొంతుకన్నా గట్టిగా వినిపించింది.

"ఆ, నాన్నా," నాకెలా స్పందించాలో తెలియడం లేదు.

"సంపత్‌ని కంగారుపెట్టకు. విషయమంతా విని నిదానంగా చెప్పు. అనంత్ ఎక్కడికి వెళ్లాడో తెలియడం లేదు. ఇవాళ్టికి రెండు వారాలు. శారద నా దగ్గరికి ఇప్పుడే వచ్చింది. నీకు తెలుసుగా అనంత్ వ్యాపారం. చిట్టీలు కట్టినవాళ్లంతా శారదని నిలేస్తున్నారట..." నాన్న చెపుతూనే ఉన్నారు. నా కళ్ల ముందు శారద రూపం మెదులుతోంది.

నాకేం అన్నట్లున్న ఆమె కళ్లు. ధీమాగా ఉన్న ఆమె చూపులు.

నేనేమి సమాధానం చెప్పానో నాకే తెలియదు.

"నాన్నా తనకెలాగైనా సహాయం చెయ్యి."

"నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా చిత్రా?" నాన్న ఫోన్ పెట్టేశారు.

నేను సంపత్‌తో విషయమంతా నెమ్మదిగా వివరించాను. సంపత్ హడావిడిపడుతూ అనంత్ స్నేహితులకు, బంధువులకు ఫోన్లు చేశాడు. అనంత్ ఎక్కడికి వెళ్లి ఉండవచ్చునోనన్న సమాచారం ఎవరూ ఇవ్వలేకపోయారు.

నాన్నతో మాట్లాడాడు సంపత్. నాన్న లాయర్‌తో, ఆడిటర్‌తో మాట్లాడాడు.

నెలలు గడిచాయి.

మాకు సెలవు దొరికీ దొరకడంతోనే హైదరాబాదుకు బయలుదేరాం.

సంపత్ నేరుగా శారద వాళ్లింటికి వెళ్లాడు. నేను అమ్మానాన్నల దగ్గరకు.

శారద ఏ స్థితిలో తమ దగ్గరకు వచ్చిందీ చెప్పాడు నాన్న.

"అనంత్ అదృశ్యమైన సంగతి ఎలా తెలిసిందో ఏమో కానీ, అతను కనిపించకుండా పోయాడని శారద గ్రహించకముందే ఈ చిట్టీలు కట్టిన వాళ్లంతా పసిగట్టేశారు. చెమటోడ్చి దాచిన డబ్బు అనంత్ దగ్గర గుమ్మరించిరి. మరి వాళ్ల కడుపు రగలిపోదూ."

"ఏం చేశారు నాన్నా?"

''చేయాల్సిందంతా చేశారు. అనంత్ వెళ్లిన మూడోరోజున అనుకుంటా శారద ఆఫీసు నుంచి వచ్చి ఇంట్లోకి వెళ్లిందోలేదో అందరూ వాళ్ల ఇంటిని చుట్టుముట్టారు. శారద ఇంట్లో ఒక్కతే ఉంది. ఆ సమయంలో మీ అత్తయ్య లేదు. ఆవిడ మీ చిన్నత్తగారింటికి వెళ్లింది. పాపం, శారద వెనుక గుమ్మం తలుపు తీసుకొని, కాంపౌండ్ వాల్ దూకి ఆ వీధిలో ఉన్న మునిసిపల్ పార్కులో మూల నక్కింది. వచ్చినవాళ్లు అరిచి ఇంటి మీద రాళ్లు విసిరారు. అనంత్‌ను, శారదను బండబూతులు తిట్టారు. ఇంటి తలుపులు పగలకొట్టి చేతి కందింది తలా ఒకటి పట్టుకుపోయారు. వీధి వీధంతా రచ్చలరావిడి చేసిపోయారు. శారద ఎంత ధీమాగా ఉండేది. నాతో చెప్తూ ఉంటే నాకే ఏడుపాగలేదు," నాన్న గొంతు రుద్ధమైంది.

ఇలా జరిగి ఉండవచ్చునన్న ఊహ కూడా నాకు రాలేదు. నేను నిర్ఘాంతపోయాను.

"నేనయితే శారద ఏ అఘాయిత్యమో చేసుకుంటుందని భయపడ్డా," అమ్మ బాధగా నిట్టూర్చింది.

''ఇంత జరిగినా శారద మాకు చెప్పిందనుకొన్నావా? ఎవరో మాట వరుసకు అంటే నేనూ, అమ్మ విషయం తెలుసుకుందామని వెళ్లాం."

"అభిమానం కల పిల్ల. ఏనాడన్నా మాట పడి ఎరుగునా? పాపం. ఎంత మొహమాటపడిందీ మాతో విషయం చెప్పడానికి. ఏదో సామెత చెప్పినట్లు మొగుడు మొట్టినందుకు కాక తోడికోడలు నవ్వినందుకు ఏడ్చిందట వెనుకటికి ఎవత్తో. చిత్రా, శారద వ్యవహారంలో నువ్వు కాస్త జాగ్రత్తగా ఉండమ్మా."

"మధ్యలో నువ్వోటి. శారదను చూసి నవ్వేట్లు ఉందా ఇప్పటి పరిస్థితి?" అమ్మ మాటలకు అడ్డొచ్చాడు నాన్న.

"నాన్నా, ఇంతకీ శారద మనింటికి ఎలా వచ్చింది?"

"అదిగో మీ అమ్మే రోజూ వెళ్లి కబుర్లు చెప్పేది. అయినా, మన ఇంటికి రావాలని శారద ఎందుకు అనుకుంటుంది? ఆ చిట్టీలు కట్టిన వాళ్లల్లో ఎవరో పోలీసు కేసు పెట్టారు. మరొకడు ఏకంగా గూండాల్నే పంపించాడు."

"బాప్‌రే," నా గుండె జారిపోయింది.

ఒకరోజు ఆ రౌడీవెధవ అర్ధరాత్రి ఇంటి మీదకు వచ్చి పచ్చిగా ప్రవర్తిస్తుంటే, వెనుక గుమ్మంలోంచి పారిపోయి వచ్చి, ఓ ఎస్.టి.డి. బూత్ నుంచి ఫోన్ చేసింది. నేనూ, అమ్మా వెళ్లి తీసుకొచ్చాం. మేం వెళ్లేసరికి తల మీదుగా ముసుగేసుకొని బూత్ వెనకాల నక్కినక్కి కూర్చుని ఉంది," నాన్న మౌనం వహించాడు.

"శారదను అలా చూసేసరికి నా కడుపు తరుక్కుపోయిందనుకో. ఎవరి కన్నబిడ్డయితేనేం కానీ, ఈ కర్మ పగవాడికి కూడా వద్దు తల్లీ, వద్దు. అయినా, ఆ శారద కన్నవాళ్లు ఎంతటి కర్కశులో. చిత్రా, విషయం తెలిశాక శారదకు సహాయం చేయకపోగా, శారద కొడుకును తెచ్చి ఇంట్లో పడేసి చక్కాపోయారు. ఆడపిల్లలు పుట్టింటి మీద పుట్టెడు ఆశలు పెట్టుకుంటారు కదా, దుర్మార్గులు, అదీ లేకుండా చేశారు," అమ్మ కొంగుతో కళ్లు తుడుచుకుంది.

నాకూ దుఃఖం ఆగలేదు. నాకు తెలియకుండానే నా కళ్లు తడిగట్టాయి.

"వాళ్లనని ఏం లాభంలే చిత్రా, బంధువులందరితోనూ చిట్టీలు కట్టించారు. వాళ్లు వచ్చి వీళ్ల ఇంటి మీద పడ్డారు. మరి వాళ్లింట్లో శారదను ఎలా ఉంచుకుంటారు? పల్లెల్లో పట్టుదలలూ, పరువు ప్రతిష్ఠలూ ఎక్కువగాదూ."

"అదేమిటి నాన్నా నువ్వు కూడా?"

"నిజం అదే చిత్రా. చేదుగానే ఉంటుంది మరి."

ఎన్ని సమస్యలున్నా కన్నవాళ్లిలా సహాయ నిరాకరణ చేయడం నాకైతే మనసొప్పలేదు, అమ్మలానే.

"అమ్మా, మరి మా అత్తయ్య... ఆవిడేం అన్నారు?"

"ఏ మాట కా మాటే చెప్పుకోవాలి. ఆవిడే శారదకు అండగా నిలబడింది. అదీ ఎప్పుడు? నేనూ, మీ నాన్న మీ చిన్నత్తగారింటికి వెళ్లి చెడామడా కడిగేశాక. ఏమయినా అనుకో, నా మనసాగింది కాదు. మన ఇంటికి వచ్చి ఉండటానికి శారద ససేమిరా ఒప్పుకోలేదు. ఎంత బతిమిలాడానని. వయసులో ఉన్న పిల్ల. ఆమెకు తోడు పసిపిల్లవాడు. అటు పోలీసులు, ఇటు రౌడీలు. ఎటు పోయినా ఖాతాదార్లు. ఆ పెద్దావిడకు ఆ మాత్రం బుద్ధీ జ్ఞానం ఉండక్కర్లా. నేను ఆ నాలుగు మాటలు కడిగేశాక ఏమనుకుందో ఏమో, శారద దగ్గరకు వచ్చేసింది," అమ్మ ముఖంలో వియ్యంకురాలి మీద సాధించిన విజయం ఓ క్షణం తళుక్కుమని మాయమైంది.

నాన్న నిట్టూర్చి గంభీరంగా అన్నాడు. "చిత్రా, నిజంగా శారద స్థానం ఊహించుకుంటేనే ఎంత బాధగా ఉందో తెలుసా. ఆమె బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు, సహోద్యోగులు అందరికీ ఒకపూటలో విరోధి అయిపోయింది. ఎందుకూ? ఆ దగుల్బాజీ వెధవ చేతగానితనానికి. చేయని నేరానికి ఎంతటి శిక్షను అనుభవించిందో చూడు. పాపం, ఎన్ని అవమానాల్ని భరించిందో, ఎంత క్షోభను అనుభవించిందో. అభిమానవంతురాలు, నోరు విప్పిందే కాదు."

అందరం చాలాసేపు మౌనంగా ఉండిపోయాం మాటలే కరవైనట్లు.

కొద్దిసేపటికి నేనే అన్నాను, "పోనీలే నాన్నా, మీరు తనకు సహాయపడ్డారుగా."

"ఏం సహాయం చిత్రా, తెలిసిన స్నేహితులు వున్నారు కాబట్టి లీగల్ ప్రొటెక్షన్ ఇప్పించాను. అరెస్టులు గట్రా జరగకుండా స్టేలు తీసుకురాగలిగాను. ఆడిటర్‌తో లెక్కలు వేయించాను కానీ, ఆమెకు జరిగిన నష్టాన్ని, ఆమె మనసుకు కలిగిన నష్టాన్ని ఎలా తొలగించగలం చెప్పు, ఎందరం ప్రయత్నించినా." నాన్న భారంగా అన్నాడు. "డబ్బు కూడా మనం సర్దేంత ఉందా చెప్పు. ముప్పై నలభై లక్షలు."

నా కళ్లముందు దీనంగా చూస్తోన్న శారద కళ్లే కదలాడుతున్నాయి. నా మనసంతా వికలమైంది. నాన్న మాటలు నా గుండె లోతుల్ని కెలికాయి.

"మీది మరీ విచిత్రం. మనిషికి మాట సాయం అన్నారు. మన చేతనయినంత చేస్తాం. అంతేకానీ..." అమ్మ పెదవి విరిచింది.

"చిత్రా, మీ నాన్న మరీ లోతుగా ఆలోచిస్తాడమ్మాయ్."

అదేమి చిత్రమో మెల్లగా నా మనసులో మరో ఆలోచన మొదలయింది. అమ్మ అన్నట్లు మాట సహాయం ఎంతయినా చేయవచ్చు. ధన సహాయం

చేయడానికి ఓ హద్దూ పద్దూ ఉండక్కర్లేదా? అదీ ఈ కాలంలో.

ఇక్కడ నుంచి చూస్తే అమెరికా అద్భుతంగానూ, ఆడంబరంగానూ కనిపిస్తుంది. అక్కడ సామాన్య జీవితం గడపడానికే మేం రెక్కలు ముక్కలు చేసు కుంటున్నాం. ఒక్కో డాలరు సంపాదించడం అంత సులభమేమీ కాదు.

అమెరికా అవకాశాల దేశం అంటారు. అందిన అవకాశాన్ని సఫలం చేసుకోగలిగినవాడే అందలం ఎక్కు తాడు. లేకపోతే అడుసులోనే.

నేనూ, సంపత్ ఇప్పుడిప్పుడే మంచి అవకాశాలు చేజిక్కించుకుంటున్నాం. బంగారు భవిష్యత్తు ఊరి స్తోంది. ఇప్పుడీ శారద ఊబిలో చిక్కుకుని మమ్మల్ని మేం కుంచించుకోవడం లేదుగా. సంపత్ గబుక్కున శారదకు ధనసహాయం చేస్తానని వాగ్దానం చేసేస్తాడేమో.

ఈమధ్యనే అప్పు చేసి కొన్న కారు, కొందామను కుంటున్న అపార్ట్‌మెంట్ నా కళ్ల ముందు మెదిలాయి.

మరి మా భవిష్యత్తు ఏమిటి?

నాలో సన్నగా మెదిలిన ఆలోచన మెల్లగా విస్త రించి మెదడంతా ఊడలు దింపుకుంటోంది.

ఎలా చేయడం? ఏం చేయడం? సంపత్‌ని ఏదో ఆవేశం కమ్మేసింది. అన్న చేసిన తప్పును తన తలకు రుద్దుకుంటున్నాడు సంపత్... సంపత్... మై డియర్ సంపత్. మన గురించి ఆలోచించు మహానుభావా.

ఎందుకోగాని నా ఆలోచనలు మాటల రూపం దాల్చడానికి నా నోటిలోంచి బయట పడటానికి వెన కాడుతున్నాయి.

నా మనసు మొద్దుబారిపోయింది. నా నాలుకా మొద్దుబారిపోయింది.

శారద పట్ల సానుభూతి, సంపత్ సహాయాల పట్ల అనుమానం- ఈ రెండూ కలిగించిన మిశ్రమ సంది గ్ధతతో ఏర్పడిన అనిశ్చితస్థితిలో నేను శారదను కలిశాను.

శారదను చూడగానే నేను కదిలిపోయాను. ఏది తల్లీ నిరుడు చూసిన ఆ శారద?

నా నోట మాట రాలేదు.

శారద ముఖంలో నెత్తురుచుక్క లేనట్లు పాలి పోయి ఉంది. మనిషి కుంచించుకుపోయి, పిట్టలా ముడుచుకుపోయి ఉంది. సంపత్‌నుగానీ, నన్నుగానీ కళ్లెత్తి చూడటం లేదు. మాతో పెదవి విప్పి మాట్లాడటం లేదు.

అత్తయ్య సంపత్‌కు అన్ని విషయాలు చెబుతూ వుంది. అనంత్‌నూ, అతని వ్యాపారాలను శారద ప్రోత్స హించడం ఆవిడకి మొదటి నుంచీ ఇష్టంలేదు. అలాగని చెప్పాపెట్టకుండా మాయమైన కొడుకుని వెనకేసుకు రావడానికి ఆవిడకు మనసు ఒప్పడం లేదు.

అనంత్ విషయాలు ఇంకా ఎన్నో శారదకు తెలుసునని ఆవిడ నమ్మకం. శారద నోరు విప్పితే చాలు నని ఆవిడ సంపత్ దగ్గర ఎంతో బాధపడింది.

శారద పిల్లవాడు, చిన్ను నాలుగేళ్లవాడు. మేం తెచ్చిన అమెరికా చాక్లెట్లు చప్పరిస్తూ, మేం తెచ్చిన బొమ్మలతో ఆనందంగా ఆడుకుంటున్నాడు ప్రపం చంతో సంబంధం లేకుండా.

కొత్త కోడలినైన నాకు శారదతో ఎంత చనువు తీసుకోవాలో అర్థం కావడం లేదు. అత్తయ్య మాటలతో ఎంతవరకు ఏకీభవించవచ్చునో అర్థం కావడం లేదు. ఎవరినీ సమర్థించలేని అసమర్థత నన్ను గందరగోళంలో పడేసింది. సంపత్ కూడా ఆశ్చర్యంగా ప్రవర్తిస్తున్నాడు. అసహనం, విసుగు, కోపం. సంపత్ కూడా నాలాంటి స్థితిలోనే ఉన్నాడని నా నమ్మకం.

చివరికి మా మౌనాల డొల్లను ఛేదించాల్సిన రోజు వచ్చింది.

మేం అమెరికాకు తిరిగి వెళ్లే రోజు వచ్చేసింది.

సంపత్, నేనూ శారదతో ఒంటరిగా మాట్లాడ టానికి సమావేశమయ్యాం.

శారద వంక చూస్తూ నేను చాలా చిన్నతనంగా భావించసాగాను. బహుశా శారద నన్నింకా పరాయి వ్యక్తి గానే భావిస్తోందేమో. ఎంతైనా తోడికోడలిని. అమ్మ అన్నట్లు శారద నా ముందు మాట్లాడటానికి అభిమాన పడవచ్చుగదా. సంపత్‌తో మనసు విప్పి మాట్లాడుతుం దేమో. అనంత్ ఆచూకీ తెలియకుండా మేము అమెరికా వెళ్లిపోవడం అనేది మా ఇద్దరికీ బోలెడంత ఒత్తిడిగా, ఆందోళనగా ఉంది. నేను సంపత్‌ను దుఃఖంలో చూడ లేను.

నేను లేచి మెల్లగా గది బయటకు వెళ్లబోయాను.

శారద చటుక్కున నా చేయి పట్టుకొని ఆపింది.

నేను ఆమె ముఖంలోకి సూటిగా చూశాను.

దిగులుతో శారద శరీరం చిక్కి శల్యమైనా, ఆమె కళ్లలో అదే ధీమా, అదే మెరుపు.

నేను మంత్రముగ్ధురాలిగా మౌనంగా శారద ఎదురుగా కూర్చుండిపోయాను.

సంపత్ ఎంతో ఆవేశంగా ఎంతోసేపు శారదను మాట్లాడించాలని చూశాడు. శారద వంచిన తల ఎత్తనే లేదు.

నా పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా ఉంది.

"వదినా..." ఆఖరి మాటగా సంపత్ అన్నాడు. "తన పరిస్థితి ఏమిటో చిట్టీలు కట్టిన వాళ్లకు వివరించి వాయిదాల మీద వాళ్ల డబ్బు వాళ్లకు తిరిగి చెల్లిస్తే పోయేది. అనంత్ ఇలా ఎందుకు చేశాడో నాకు అర్థం కావడం లేదు. ఏది ఏమైనా, అనంత్ చేసింది బాధ్యతా రాహిత్యమే. అసమర్థతే. మిమ్మల్ని, చిన్నుని, అమ్మని ఇలా నడివీధిలో నిలబెట్టిపోవడం క్షమించరాని నేరం."

సంపత్ దవడ బిగుసుకుంది. తనను తాను సంబాళించుకొని అన్నాడు.

"నెలల తరబడి ఇలా కనిపించకుండా పోవడం," సంపత్ గొంతు పెగల్లేదు. తనను తాను కూడదీసు కున్నట్లుగా సంపత్ ముఖ కవళికలు చెపుతున్నాయి. చాలాసేపు సంపత్ మౌనంగానే ఉండిపోయాడు.

"అనంత్ చేసిన అప్పులు, చిట్టీలు వేసినవారి అకౌంట్లు అన్నీ లెక్కలు వేశాము నేనూ, మామయ్యా. ముప్పై, నలభై లక్షలకు పైగా ఉన్నాయి. నా దగ్గర ఇప్పు డంత డబ్బు లేదు. అందరితో మాట్లాడాను. వాయిదా లపై తీరుస్తాను. పోతే..."

శారద వంచిన తల వంచినట్లుగానే ఉంది.

నా గుండె గొంతులో కొట్టుకుంది. సంపత్ అను కున్నంత పనీచేశాడు.

సంపత్‌తో విభేదించలేనంతగా కట్టిపడేస్తోంది నా ఎదురుగా కూర్చున్న శారద దైన్యం.

"చిన్ను చదువుసంధ్యల ఖర్చు నేను భరిస్తాను. అయితే, వదినా- మీరు..." చేయవలసిన వాగ్దానాలన్నీ చేసేసి ఇప్పుడు సంపత్ ఏ విషయం చెప్పడానికి అంత సందేహిస్తున్నాడో నాకు అర్థం కాలేదు. అతని ధోరణి మాటలు వెతుక్కుంటున్నట్లుగా ఉంది. "వదినా, మీరు విడాకులు తీసుకోండి. ఇలాంటి వ్యక్తితో జీవితం అర్థం లేదు."

సంపత్ ఆ నాలుగు ముక్కలు గబగబ అనేశాడు.

శారద విషయమేమోకానీ నేను నిర్ఘాంత పోయాను.

సంపత్ పాశ్చాత్య ధోరణిలో కొట్టుకుపోతున్నాడా?

శారద రియాక్షన్ ఎలా ఉంటుందోనని ఆత్రంగా ఆమె వంక చూశాను.

శారద ముఖంలో ఏ భావమూలేదు. ఏ భావమూ లేనితనమే చాలా భయపెడుతోంది. మా ముగ్గురి మధ్యా నిశ్శబ్దం భయంకరంగా తాండవిస్తోంది. క్షణాలు భారంగా వేళ్లాడుతున్నాయి. చివరికి శారద నోరు విప్పింది.

"సంపత్, మనిషే మాయమైనప్పుడు ఎవరికి ఇమ్మంటావ్ విడాకులు?" ఆ ఒక్కమాట అనేసి శారద చివ్వున లేచి వెళ్లిపోయింది. సంపత్ తప్పేమయినా అన్నానా అన్నట్లు నా వంక చూశాడు.

సంపత్ నోటిలోంచి ఆ మాటలు రావడంతో ఇంకా ఆశ్చర్యంలోంచి తేరుకోని నేను అతన్ని సమర్థిస్తూ తలాడించాను. అయినా, మనసులో ఉన్న ఆలోచనను మనసులోనే ఉంచుకోవాలి. ముఖాన అనేసేయడ మేనా? శారదకు కోపం వచ్చిందేమో. నేను శారద వెనకే నడిచాను.

శారద కిటికీ ఊచల్ని పట్టుకొని చీకట్లోకి దీక్షగా చూస్తోంది.

"శారదా మరోలా అనుకోకు... సంపత్ ఉద్దేశం ఏమిటంటే..."

"చిత్రా, సంపత్ అన్నదాంట్లో తప్పేమీలేదు." శారద ఇంకా చీకట్లోకే చూస్తోంది. ఒక్కోమాటా నెమ్మది గా మంచుకన్నా చల్లగా అంటోంది.

"అనంత్ అన్నమాటే నాకు అదృశ్యమైపోయి నప్పుడు... ఇక ఈ విడాకులు..."

నేను శారదని ఓదార్చుతున్నట్లు భుజంమీద చేయి వేశాను. శారద ముఖంలో నవ్వు మెదిలింది. నా చేతిని మెల్లగా తట్టింది స్నేహపూర్వకంగా. శారద నవ్వు మెల్లమెల్లగా పెద్దదయింది. కొద్దిసేపట్లో శారద విరగబడి నవ్వుతోంది. నాకు ఎలా స్పందించాలో తెలియలేదు. బిత్తరపోయి వెనక్కి జరిగి నిల్చున్నాను.

శారద నవ్వాపింది. గంభీరంగా అంది.

"చిత్రా, నేను నీ అంత చదువుకోలేదు. నీకు వున్నంత ప్రపంచజ్ఞానం లేదు. నేను చూసిన ప్రపంచ మంతా నా భర్త చూపించిందే. అతను అరచేతిలో స్వర్గం చూపిస్తే సంబరపడ్డాను. వచ్చిన జీతాలతో ఆనందంగా, గౌరవంగా బతుకుతున్నాం. ఏం మాయ మమ్మల్ని కమ్మిందో కానీ ఈ మాయదారి చిట్టీల ప్రపంచంలో చిక్కుకుపోయాం. చెప్పాకదా, అనంత్ ఏది చెపితే అది నాకు వేదవాక్కు. అతను నేర్పిన పలుకులను చిలకలా వల్లించాను. నా వాళ్లందరూ ఖాతాదార్లయిపోయారు. అప్పుడు నాకు దాంట్లో తప్పేమీ కనిపించలేదు..."

శారద కాసేపు మౌనం వహించింది. నేను ఆమె ఏం చెప్తుందోనని చెవులు అప్పజెప్పాను.

"భరోసా... నా భర్త మీద భరోసా... పిచ్చిదాన్ని... ఆ భరోసాను నా భర్తే భళ్లున బద్దలు కొడతాడని నేను కలలోనైనా ఊహించలేదు."

శారద బద్దలయింది. "నేను విధవనైనా బోలెడంత సానుభూతి దక్కేది. కానీ, ఇప్పుడు..."

శారద వెక్కివెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

శారదను ఓదార్చడానికి నాకు ధైర్యం చాలలేదు.

శారద కొద్దిసేపటికి తానే తేరుకొంది. శారద మళ్లీ మాట్లాడుతోంది. ఏదో ఇంద్రజాలం ఆమెను మాట్లాడిస్తున్నట్లుగా, "నా ఇంటి వెనుక గోడ దూకి పారిపోవాల్సి వచ్చినప్పుడు, నా ఇంటి ఎదురు మున్సిపల్ పార్కులో మూలన నక్కి రాత్రంతా గడపాల్సినప్పుడు- ఇంతకన్నా ఎక్కువే ఏడ్చాను చిత్రా. నాతో ఉద్యోగం చేసేవాడే, నా వైపు ఏనాడూ కన్నెత్తి చూడనివాడే నన్ను ఉంచుకుంటాను రమ్మని వేధిస్తున్నప్పుడు ఇంతకన్నా ఎక్కువే ఏడ్చాను. మొగుడి ఆచూకీ పెళ్లానికి తెలియకుండా ఎలా ఉంటుందని పోలీసులు కుళ్లబొడిచి ఆరాలు తీసినప్పుడు కుళ్లికుళ్లి ఏడ్చాను. అమ్మానాన్న, బంధువులు, స్నేహితులు- అందరూ... అందరూ నన్నో దోషిలా నిలబెట్టినప్పుడు కుమిలి కుమిలి ఏడ్చాను చిత్రా. పొట్టకూటి కోసం ఉన్న ఉద్యోగం వదులుకోలేక- అవహేళనల మధ్య, అవమానాల మధ్య ఉద్యోగం చేయలేక- క్షణక్షణం ఏడుస్తూనే ఉన్నాను చిత్రా."

శారద నా వైపు సూటిగా చూసింది. ఆ తడి కళ్లు ఎప్పటిలా ధీమాగా తళతళలాడుతున్నాయి.

"కానీ చిత్రా, నా ఏడుపులో నా కల్మషాలన్నీ కరిగిపోయాయి. నేను మల్లెపందిరి అనుకున్న నా జీవితం సాలెగూడులా కరిగిపోయింది. నావి కాని నా నమ్మకాలన్నీ, నా విశ్వాసాలన్నీ సమూలంగా కరిగిపోయాయి. నేనేమిటో నాకు తెలిసింది.

"ఇక నాకు ఎవరి వెన్నుదన్ను అవసరం లేదు. జరిగిందంతా ఆ పాపంలో పాలు పంచుకొన్నదానికి చేసుకున్న ప్రాయశ్చిత్తం అనుకుంటాను."

నేను శారద చెప్పింది వింటున్నాను.

ఈరోజు సంపత్ నాకు సహాయం చేయడానికి వచ్చాడు. సంతోషమే. కానీ, అన్న చేసిన పనికి అవమాన పడుతోన్న ఆవేశం తప్ప నాకు మరోటి కనిపించడం లేదు. రేపు మీరు తిరిగి అమెరికా వెళ్లిపోతారు. మీ జీవితం మీకుంది. మీ అవసరాలు మీకుంటాయి. మీ ఆలోచనలు మీకుంటాయి. మా కష్టాలు తీర్చడానికి, మీ భవిష్యత్తుని కాలదన్ని, మీరు అష్టకష్టాలు పడటం నాకు ఇష్టంలేదు. ఈరోజంటే మీరిద్దరు. రేపీపాటికి మీరూ, మీ పిల్లలు. చిత్రా, నేనే నీ స్థానంలో ఉంటే నా అవసరాలని కాదని నీకు సహాయం చేస్తానా? వద్దు, దేనికైనా హద్దు ఉంటుంది. చిత్రా, మీరు నాకు ఎలాంటి డబ్బూ పంపొద్దు."

శారద ముందు నేను మరుగుజ్జునైపోయాను. ఏం అనాలో నోట మాట రాలేదు. నాలో మెదిలినవి ఆమెకి తెలిసినట్లు ఎలా మాట్లాడుతోంది? నేను సిగ్గుతో చితికిపోయాను. శారద కళ్లలోకి చూసే ధైర్యం ఇక నాకు లేదు. లేనేలేదు.

"నా తిప్పలేవో నేను పడతాను. ఎందుకంటే..." శారద కాసేపు మౌనం వహించింది.

"అనంత్ నిన్న నన్ను కలిశాడు."

నా నెత్తిన పిడుగుపడింది. ఈ విషయం శారద ఎందుకు దాచింది? మేం అందరం వెర్రివాళ్లలా కనబడుతున్నామా?

"అనంత్‌కు ఎలా తెలుసోకానీ సంపత్ సహాయం చేయబోతున్నాడన్న సంగతి తెలుసు. నన్ను మరింత ఏడ్చి, మరింత నటించి, మరింత డబ్బు మీ నుండి రాబట్టమని ఆదేశించాడు. అంతే, అతనిపట్ల నా మనసులో ఏ మూలో ఉన్న భ్రమ కూడా పటాపంచలయింది. ఇది కట్టుకొన్న భార్యను వ్యభిచారం చేయమనడం కన్నా ఘోరంగా లేదూ."

శారద మాటలు మంచుకత్తుల్లా ఉన్నాయి.

"అలాగేనని తలాడించి, అతని చిరునామా తీసుకున్నాను. నేను తీసుకెళ్లే సమాచారం కోసం అతను ఆత్రంగా ఎదురుచూస్తూ ఉంటాడు. రేపు మీరు వెళ్లగానే ఖాతాదార్లందరికీ, పోలీసులకూ, గూండాలకూ అనంత్ చిరునామా ఇస్తాను, కనికరం లేకుండా. అతన్నీ అనుభవించనీ నేను పడిన చిత్రవధనంతా."

నేను శిలనే అయ్యాను. శారద కంఠంలో ద్వేషం లేదు. పగలేదు. అంతకన్నా లోతైన భావనే ఉంది. అది ఏమిటో నాకు తెలియదు.

"నువ్వు సంపత్‌కు ఈ విషయం చెప్పవనే నా నమ్మకం చిత్రా. ఎందుకంటే సంపత్ ఆ అన్నకు తమ్ముడేగా."

శారద మెల్లిగా నా ముందు నుంచి కదిలిపోయింది. శారద మాటల్లో హేళనే ఉందో, హెచ్చరికే వుందో నాకు తెలియదు. అవి అనుక్షణం నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. ఆమె చూపుల్లా!

*ఇండియాటుడే, 4 మే 1999*